ప్రతి దరఖాస్తు పక్కాగా ఆన్‌లైన్

శాలిగౌరారం : ఇటుకులపహాడ్ గ్రామంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మందుల సామేల్


బొడ్రాయిబజార్ : మున్సిపల్ కార్యాలయంలో డేటా ఎంట్రీని తనిఖీ చేసి సూచనలు చేస్తున్న కలెక్టర్ ఎస్.వెంకట్రావ్

- జిల్లాలో వచ్చిన ప్రతి దరఖాస్తును ఆన్‌లైన్‌లో పొందుపరుస్తాం
- కలెక్టర్ ఎస్.వెంకట్రావ్

బొడ్రాయిబజార్, జనవరి 6 : జిల్లాలో సుమారు 3 లక్షల 21 వేల ప్రజా పాలన దరఖాస్తులను స్వీకరించినట్లు, స్వీకరించిన ప్రతి దరఖాస్తును ఆన్‌లైన్‌లో పొందుపరుచడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ ఎస్.వెంకట్రావ్ తెలిపారు. శనివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయంలో ప్రజల నుంచి స్వీకరించిన దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేసి మాట్లాడారు. ప్రజా పాలనకు సంబంధించి నియమించిన నోడల్ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, తాసీల్దార్లు, ఎంపీడీఓలు ఆన్‌లైన్ ప్రక్రియ సక్రమంగా అయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆయన వెంట జడ్పీ సీఈఓ సురేశ్, మున్సిపల్ కమిషనర్ పి.రామానుజులరెడ్డి, మెప్మా పీడీ రమేశ్‌నాయక్, ఎస్.ఎస్.ఆర్.ప్రసాద్ ఉన్నారు.

సూర్యాపేట రూరల్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన గ్రామ సభల్లో స్వీకరించిన దరఖాస్తులను ఆన్‌లైన్‌లో పక్కాగా నమోదు చేయాలని జడ్పీ సీఈఓ సురేశ్‌కుమార్ అన్నారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ప్రజా పాలన దరఖాస్తుల ఆన్‌లైన్ ఎంట్రీని పరిశీలించి మాట్లాడారు. ఆన్‌లైన్ ఎంట్రీలో తప్పులు దొర్లకుండా సక్రమంగా నిర్వహించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాస్ రావు, ఎంపీఓ పరాంకుశరావు, ఏపీఓ వెంకన్న పాల్గొన్నారు.

శాలిగౌరారం : ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందేలా కృషి చేస్తానని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. మండలంలోని ఊట్కూర్, ఇటుకులపహాడ్ గ్రామాల్లో శనివారం చివరి రోజు నిర్వహించిన ప్రజా పాలన కార్యక్రమాల్లో పాల్గొని మాట్లాడారు. పేదల ఆర్థిక స్వావలంబన కోసం ప్రభుత్వం అందిస్తున్న ఆరు గ్యారెంటీ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆయా కార్యక్రమాల్లో టీపీసీసీ ఉపాధ్యక్షుడు చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, జడ్పీటీసీ ఎర్ర రణీలాయాదగిరి, సర్పంచులు వేముల లింగయ్య, అల్లి సైదులు, మండలాధ్యక్షుడు కందాల సమరంరెడ్డి, ఎంపీటీసీ నోముల జనార్దన్, అన్నెబోయిన సుధాకర్, కుర్ర లింగయ్య, కప్పల శ్రీధర్, మాచర్ల శ్రీను, పుల్లూరి దేవేందర్, వేముల గోపీనాథ్, శేషరాజులపెల్లి రామచంద్రు పాల్గొన్నారు.

తిరుమలగిరి / తుంగతుర్తి / మోతె /నేరేడుచర్ల / గరిడేపల్లి : తిరుమలగిరి మండలంలోని గ్రామ పంచాయతీల్లో ఏర్పాటు చేసిన గ్రామ సభల్లో ప్రజలు ప్రభుత్వ పథకాలకు పెద్ద ఎత్తున దరఖాస్తు చేసుకున్నారు. ప్రభుత్వం ఈ నెల 17 వరకు ప్రజా పాలన దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తి చేయాలని ఇప్పటికే ఆదేశాలు జారీ చేసిన నేపథ్యంలో అధికారులు ఆన్‌లైన్ నమోదు ప్రక్రియపై దృష్టి సారించారు. తుంగతుర్తి తాసీల్దార్ కార్యాలయంలో ప్రజా పాలన దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియను తాసీల్దార్ యాదగిరిరెడ్డి పరిశీలించారు. మోతె మండలంలోని సిరికొండ గ్రామంలో శనివారం నిర్వహించిన ప్రజా పాలన కార్యక్రమంలో ఎంపీడీఓ హరిసింగ్ పాల్గొన్నారు. నేరేడుచర్ల మున్సిపాలిటీలో కొనసాగుతున్న దరఖాస్తుల ఆన్‌లైన్ డేటా ఎంట్రీని హుజూర్‌నగర్ ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి పరిశీలించారు. అదేవిధంగా గరిడేపల్లి మండలంలోని కల్మల్‌చెర్వులో చేపట్టిన ప్రజా పాలనలో దరఖాస్తుల స్వీకరణను పరిశీలించారు.

తొలి రోజు 23,258 దరఖాస్తులు ఆన్‌లైన్

సూర్యాపేట, జనవరి 6 : జిల్లాలో ప్రజా పాలన దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియ వేగంగా జరుగాలని కలెక్టర్ ఎస్. వెంకట్రావ్ ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయంలో జరుగుతున్న డేటా ఎంట్రీని ఆయన పరిశీలించి మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా 489 టీమ్‌లను డేటా ఎంట్రీ కోసం నియమించినట్లు తెలిపారు. మున్సిపాలిటీల్లో 100 టీమ్‌లు, గ్రామ పంచాయతీల్లో 389 టీమ్‌లు డేటా ఎంట్రీ కోసం పని చేస్తున్నట్లు చెప్పారు. తొలి రోజు జిల్లా వ్యాప్తంగా 23,258 దరఖాస్తులు డేటా ఎంట్రీ చేయగా గ్రామ పంచాయతీల్లో 17,661, మున్సిపాలిటీల్లో 5,597 దరఖాస్తులను ఆన్‌లైన్ ఎంట్రీ చేసినట్లు పేర్కొన్నారు.

తుమ్మలపల్లి రామాలయంలో ఘనంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠ

- ఎమ్మెల్యే పద్మావతి హాజరు


సీతారామచంద్ర స్వామి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే పద్మావతి

మోతె, జనవరి 6 : మండలంలోని తుమ్మలపల్లి గ్రామంలో సీతారామచంద్ర స్వామి ఆలయంలో విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్ఠను శనివారం ఘనంగా నిర్వహించుకున్నారు. కార్యక్రమంలో కోదాడ ఎమ్మెల్యే పద్మావతీఉత్తమ్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ వాసంశెట్టి రమేశ్, జడ్పీటీసీ పందిళ్లపల్లి పుల్లారావు, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు కీసర సంతోష్‌రెడ్డి, మామిడి వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, సత్యనారాయణరెడ్డి, నూకల మధుసూదన్‌రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆశ్రిత వాత్సల్యుడు భగవంతుడు

- త్రిదండి దేవనాథ జీయర్ స్వామి

భక్తులను ఉద్దేశించి ప్రవచిస్తున్న దేవనాథ జీయర్ స్వామి,

బొడ్రాయిబజార్, జనవరి 6 : ఆశ్రిత వాత్సల్యుడు భగవంతుడని ప్రతి ఒక్కరూ భక్తిభావంతో ఉండాలని త్రిదండి దేవనాథ జీయర్ స్వామి అన్నారు. జిల్లా కేంద్రంలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో జరుగుతున్న ధనుర్మాస వ్రత మహోత్సవాల్లో శనివారం సాయంత్రం ఆయన పాల్గొని ప్రవచనాలు చేశారు. సూర్యాపేట పట్టణం ఆధ్యాత్మిక కేంద్రమని కొనియాడారు. ధనుర్మాస వ్రత వైభవాన్ని శ్రీకృష్ణ భగవానుడి తత్వాన్ని భక్తులకు వివరించారు. ఆండాల్ గోష్టి, వికాస తరంగిణి మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి ఆశీస్సులు పొందారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు ఎన్‌సీహెచ్.వేణుగోపాలాచార్యులు, సహాయ అర్చకులు, ఆండాళ్, వికాస తరంగిణి భక్తిబృందం పాల్గొన్నారు.

నేడు వేణుగోపాల స్వామి ఆలయం సందర్శన

ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా సూర్యాపేటకు వచ్చిన త్రిదండి దేవనాథ జీయర్ స్వామి ఆదివారం వేణుగోపాల స్వామి ఆలయాన్ని సందర్శించనున్నారు. అక్కడ భక్తులందరికి తీర్థగోష్టి స్వామి వారు స్వయంగా తీర్థం ఇవ్వనున్నట్లు తెలిపారు.

ప్రతి ఒక్కరూ దైవభక్తి కలిగి ఉండాలి

- ఎమ్మెల్యే మందుల సామేల్

శాలిగౌరారం, జనవరి 6 : ప్రతిఒక్కరూ దైవభక్తిని అలవర్చుకోవాలని, అప్పుడే గ్రామాలు ప్రశాంత వాతావరణంలో ఉంటాయని ఎమ్మెల్యే మందుల సామేల్ సూచించారు. మండలంలోని వల్లాల గ్రామంలో పార్వతీ శంభులింగేశ్వర స్వామి ఆలయ రాజగోపురం నిర్మాణానికి, నూతన ఆరోగ్య ఉప కేంద్రం భవన నిర్మాణానికి శనివారం శంకుస్థాపన చేసి మాట్లాడారు. అంతకు ముందు ఆలయ ధర్మకర్తలు వావిలాల రామలింగయ్యశర్మ పూర్ణకుంభంతో ఎమ్మెల్యేకు స్వాగతం పలికారు. ఆయా కార్యక్రమాల్లో సర్పంచ్ షేక్ ఇంతియాజ్, ఎంపీటీసీ మాదగోని కవితారామలింగయ్య, భూపతి అంజయ్యగౌడ్, భూపతి వెంకన్నగౌడ్, పెరుమాండ్ల నరేశ్, గుండ్లపెల్లి శంకరయ్య, సైదులు, మహేశ్ పాల్గొన్నారు.

ప్రభుత్వ నిర్ణయంపై విద్యా వలంటీర్ల హర్షం

నాగారం, జనవరి 6 : వచ్చే విద్యా సంవత్సరం బడులు తెరచిన తొలిరోజు నుంచే విద్యా వలంటీర్లు విధుల్లో ఉండేలా చూడాలన్న రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయంపై ఆ సంఘం మండలాధ్యక్షుడు మల్లెపాక యాకయ్య హర్షం వ్యక్తం చేశారు. శనివారం మండల కేంద్రంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. కరోనాకు ముందు రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల్లో దాదాపు 12,600 మంది విద్యా వలంటీర్లు పని చేసినట్లు తెలిపారు. ప్రభుత్వ నిర్ణయం ప్రకారం శాశ్వత ఉపాధ్యాయులు విధుల్లో చేరే వరకు గతంలో పని చేసిన విద్యా వలంటీర్లను రెన్యూవల్ చేసి విధుల్లోకి తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో విద్యా వాలంటీర్లు రేణుక, మల్లీశ్వరి, కవిత, గంగాధర్, సైదులు, లింగయ్య, అవిలయ్య, వసంత, మధు, పరమేశ్వర్ పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

- విశ్రాంత ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సీతారామయ్య

నేరేడుచర్లలో విశ్రాంత ఉద్యోగుల సంఘం భవన నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సీతారామయ్య

నేరేడుచర్ల, జనవరి 6 : విశ్రాంత ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని విశ్రాంత ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆర్.సీతారామయ్య అన్నారు. స్థానిక అయప్ప స్వామి ఆలయ సమీపంలో రూ.15 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న విశ్రాంత ఉద్యోగుల సంఘం భవన నిర్మాణ పనులకు శనివారం ఆయన వేద పడింతుడు ఓంకార్, విశ్రాంత ఉద్యోగులు, రాజకీయ నాయకులతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేరేడుచర్లలో ఈ భవన నిర్మాణంతో నియోజవర్గంలోని అన్ని మండలాల్లో భవన నిర్మాణాలు పూర్తవుతాయన్నారు. ప్రతి మండలంలో ఒక పక్కా భవనం ఉన్న నియోజకవర్గంగా హుజూర్‌నగర్ కావడం ఎంతో గర్వకారణంగా ఉందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ చందమళ్ల జయబాబు, జిల్లా అధ్యక్షుడు సుదర్శన్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు రాంబాబు, కోశాధికారి హమీద్‌ఖాన్, కార్యదర్శి బొడ్డుపల్లి సుందరయ్య, జిల్లా కౌన్సిలర్ చంద్రశేఖర్, మండలాధ్యక్షుడు సీహెచ్.పూర్ణచంద్రారెడ్డి, కార్యదర్శి పోతుగంటి సత్యనారాయణ, భవన నిర్మాణ కమిటీ అధ్యక్షుడు పులిజాల వెంకటరమణారావు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

బాక్సింగ్‌లో స్టేట్ ఫస్ట్ విజేతకు అభినందన

మోతె, జనవరి 6 : బాక్సింగ్‌లో స్టేట్ ఫస్ట్, జాతీయ స్థాయిలో తృతీయ స్థానంలో నిలిచిన మండలంలోని నామవరం గ్రామానికి చెందిన కత్తుల సల్మాన్‌రాజ్‌ను ఎమ్మెల్యే పద్మావతీఉత్తమ్ శనివారం అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యువత అన్ని క్రీడల్లో రాణించాలని సూచించారు. సల్మాన్‌రాజ్ రాష్ట్రాన్ని జాతీయ స్థాయిలో నిలిపినందుకు అభినందనలు తెలిపారు. సల్మాన్‌రాజ్ బాక్సింగ్‌లో మరెన్నో బహుమతులు గెలుపొందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ పందిళ్లపల్లి పుల్లారావు, పార్టీ మండలాధ్యక్షుడు సంతోష్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, లింగయ్య, రాములునాయక్ పాల్గొన్నారు.

రూ.1.95కోట్లతో బీటీ రోడ్డు పనులు ప్రారంభం

నేరేడుచర్ల, జనవరి 6 : మండలంలోని రామగిరి నుంచి మూసీఒడ్డు తండా గ్రామానికి వెళ్లే రహదారి బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.1.95 కోట్లు మంజూరవగా జడ్పీటీసీ రాపోలు నర్సయ్య, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు కొణతం చిన్నవెంకటరెడ్డి, గ్రామ సర్పంచ్ సైదమ్మ శనివారం పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు రవీందర్‌రెడ్డి, పాపిరెడ్డి, వెంకట్‌రెడ్డి, పాండునాయక్, కిరణ్‌నాయక్, సైదానాయక్, శ్రీను, కోటి, పీఏసీఎస్ డైరెక్టర్లు సురేశ్‌రెడ్డి, శంకరాచారి పాల్గొన్నారు.

న్యాయ వ్యవస్థపై ప్రజల నమ్మకాన్ని కాపాడాలి

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.రాజగోపాల్
- కొత్త సిబ్బందికి నియామక పత్రాలు అందజేత

ఉద్యోగులకు నియామక పత్రాలు అందిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.రాజగోపాల్

సూర్యాపేటలీగల్, జనవరి 6 : కోర్టుకు వచ్చే కక్షిదారులను గౌరవించి ప్రజలకు న్యాయ వ్యవస్థపై ఉన్న నమ్మకాన్ని కాపాడాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి రాజగోపాల్ సిబ్బందికి సూచించారు. జిల్లాలోని వివిధ కోర్టుల్లో నియమితులైన సిబ్బందికి శనివారం నియామక పత్రాలు అందజేసి మాట్లాడారు. నియామక పత్రాలు తీసుకున్న వారు ఈ నెల 17 లోగా విధుల్లో చేరాలన్నారు. ప్రజా సేవ చేయడం ఉద్యోగుల అదృష్టమన్నారు. కార్యక్రమంలో సూర్యాపేట మొదటి అదనపు జిల్లా జడ్జి కె.సురేశ్, అదనపు జూనియర్ సివిల్ జడ్జి జె.ప్రశాంతి పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహుడి స్వాతి నక్షత్ర కల్యాణం

చివ్వెంల, జనవరి 6 : మండలంలోని ఉండ్రుగొండ గుట్టల్లో కొలువై ఉన్న లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో శనివారం స్వాతి నక్షత్రం సందర్భంగా స్వామివారికి భూలక్ష్మి, భూదేవికి అత్యంత వైభవంగా అర్చకులు కల్యాణం జరిపించారు. కల్యాణానికి ఉమ్మడి జిల్లా నుంచే కాకుండా, వివిధ జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో నల్లగొండ రామాలయ అధ్యక్షుడు చకిలం వేణుగోపాల్‌రావు, ఉండ్రుగొండ ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

గరిడేపల్లి, జనవరి 6 : రోడ్డు ప్రమాదంలో గాయపడిన మండలంలోని కల్మల్‌చెర్వు గ్రామానికి చెందిన గజగంటి హుస్సేన్‌ను బీఎస్పీ మండలాధ్యక్షుడు అమరవరపు వెంకటేశ్వర్లు శనివారం పరామర్శించారు. ఈ సందర్భంగా 15 వేల ఆర్థిక సాయం చేయడంతో పాటు నిత్యావసర వస్తువులు అందించారు. అనంతరం మాట్లాడుతూ పేద కుటుంబానికి అండగా ఉండేందుకు ఆర్థిక సాయం చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ అధ్యక్షుడు జిలకర రామస్వామి, బీవీఎఫ్ కన్వీనర్ ప్రేమ్‌కుమార్, మండల ఉపాధ్యక్షుడు పవన్, సతీశ్ పాల్గొన్నారు.

ముగ్గురి రిమాండ్

కొండమల్లేపల్లి, జనవరి 6 : రెండు బైక్‌లు, రూ.90వేల నగదు దొంగిలించిన ముగ్గురు నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు సీఐ రాఘవేందర్‌రెడ్డి, ఎస్ఐ వీరబాబు తెలిపారు. శనివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో వివరాలను వెల్లడించారు. కొండమల్లేపల్లి పట్టణ పరిధిలోని పాత గ్రామానికి చెందిన బోడ యాదయ్యకు చెందిన బుల్లెట్ బైక్ అక్టోబర్ 27న చోరీకి గురికాగా ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తులో భాగంగా పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టగా అనుమానాస్పదంగా కనిపించిన తిప్పర్తి మండలంలోని ఖాజీరామారం గ్రామానికి చెందిన గంటె కంపు మధుకుమార్‌ను అదుపులోకి తీసుకొని అతడి వద్ద నుంచి బుల్లెట్ బైక్, నకిరేకల్ పోలీస్ స్టేషన్ పరిధిలో పల్సర్ బైక్ దొంగిలించిన కోదాడలోని బంజారా కాలనీకి చెందిన కారం శ్రీకాంత్‌ను పట్టుకొని అతడి వద్ద నుంచి బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. దాంతో పాటు జేబీ కాలనీకి చెందిన రమావత్ పుల్‌సింగ్ ఇంట్లోంచి రూ. 90 వేల నగదు దొంగిలించిన కొండమల్లేపల్లి పట్టణానికి చెందిన దేవరాయ సత్యనారయణను కూడా అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

నేటి విద్యార్థులే భావి భారత పౌరులు

- కోదాడ డీఎస్పీ ప్రకాశ్

కోదాడ టౌన్, జనవరి 6 : నేటి విద్యార్థులే భావి భారత పౌరులని కోదాడ డీఎస్పీ ప్రకాశ్ అన్నారు. ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో డిసెంబర్ 17న నిర్వహించిన నియోజకవర్గ పదో తరగతి విద్యార్థుల టాలెంట్ టెస్ట్ విజేతలకు పట్టణంలోని ఎఫ్ఆర్ఎస్ జూనియర్ కళాశాలలో శనివారం బహుమతులు అందించారు. అనంతరం మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి భవిష్యత్‌లో ఉన్నత స్థాయికి ఎదుగాలని ఆకాంక్షించారు. తల్లిదండ్రులు, చదువు నేర్పిన గురువులకు, దేశానికి మంచి పేరు ప్రతిష్టలు తేవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల శ్రీనివాస్‌రావు, ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి చేపూరి కొండల్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి నరేశ్, కళాశాల కరస్పాండెంట్ నాగేశ్వర్‌రావు, ప్రిన్సిపాల్ వేణుగోపాల్, బాణాల నాగరాజు, మామిడి రామారావు, హనుమంతరావు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ధనుర్మాస పూజలు

మేళ్లచెర్వు, జనవరి 6 : మండలవ్యాప్తంగా వైష్ణవ ఆలయాల్లో ధనుర్మాసోత్సవాలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విష్ణు సహస్ర నామ పారాయణం, అభిషేకాలు, కుంకుమార్చనలు, సప్తహారతులు నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో అర్చకులు సుదర్శనం ప్రసాదాచార్యులు, మోహనకృష్ణ, వరప్రసాదాచార్యులు, శ్రీనివాసాచార్యులతో పాటు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

రోడ్డు పక్కకు దూసుకుపోయిన రాజధాని బస్సు

మోతె, జనవరి 6 : రాజధాని బస్సు రోడ్డు కిందకు దూసుకోపోయిన సంఘటన మండలంలోని మామిళ్లగూడెం టోల్‌ప్లాజా వద్ద శనివారం జరిగింది. అదృష్టవశాత్తు ఎవరికి ఏం కాలేదు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం డిపోకు చెందిన రాజధాని బస్సు హైదరాబాద్ నుంచి ఖమ్మం వైపు వేగంగా వస్తూ మామిళ్లగూడెం టోల్‌ప్లాజా వద్ద రోడ్డు పక్కకు దూసుకెళ్లింది. ప్రమాదంలో బస్సులో ప్రయాణిస్తున్న ఆరుగురు ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. ప్రమాదంలో ప్రయాణికులకు ఏమీ కాకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

శాస్త్రోక్తంగా నృసింహుడి నిత్య కల్యాణం

మఠంపల్లి, జనవరి 6 : మండలంలోని మట్టపల్లి లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో శనివారం నిత్య కల్యాణం శాస్త్రోక్తంగా జరిపించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు పంచామృతాలతో అభిషేకాలు చేసి పట్టువస్త్రాలతో అలంకరించారు. అనంతరం ఆలయ పురవీధుల్లో గరుడ వాహనంపై ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్త చెన్నూరు మట్టపల్లిరావు, విజయ్ కుమార్, ఈఓ సిరికొండ నవీన్, ఆలయ అర్చకులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

జడ్పీహెచ్ఎస్ విద్యార్థులకు వైద్య పరీక్షలు

నేరేడుచర్ల, జనవరి 6 : ఆర్‌బీఎస్‌కే ఆధ్వర్యంలో నేరేడుచర్ల జడ్పీహెచ్ఎస్ విద్యార్థులకు శనివారం వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆర్‌బీఎస్‌కే మెడికల్ అఫీసర్ ఆరిఫ్ మాట్లాడుతూ సీతాకాలంలో వ్యాపించే వ్యాధులపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎం బట్టు మధు, ఫార్మాసిస్ట్ నాగరాజు, ఏఎన్ఎం వరలక్ష్మి, ఉపాధ్యాయులు నరసకుమారి, సైదులు, శౌరి, వెంకటేశ్వర్లు, అన్నపూర్ణ, రవి, కృష్ణప్రసాద్, కల్పన శ్రీనివాస్‌రెడ్డి, పాల్గొన్నారు.

ట్రాక్టర్ బైక్‌ను ఢీకొని ఒకరి మృతి

నార్కట్‌పల్లి, జనవరి 6 : ట్రాక్టర్ బైక్‌ను ఢీకొన్న ప్రమాదంలో ఒకరు మృతి చెందగా మరొకరికి గాయాలయ్యాయి. ఈ సంఘటన మండలంలోని అక్కెనపల్లి గ్రామ శివారులో శనివారం జరిగింది. ఎస్ఐ నర్సిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం అక్కెనపల్లి గ్రామానికి చెందిన ముద్దం రామచంద్రు(63), అంజయ్యతో కలిసి బైక్‌పై తుమ్మలగూడెం నుంచి కక్కిరేణికి వెళ్తుండగా ట్రాక్టర్ అతివేగంగా వచ్చి ఢీకొంది. ప్రమాదంలో రామచంద్రు అక్కడికక్కడే మృతిచెందగా, అంజయ్యకు తీవ్ర గాయాలయ్యాయి.

ముగ్గుల పోటీల విజేతలతో మున్సిపల్ చైర్‌పర్సన్ అన్నపూర్ణ

ముగ్గుల పోటీ విజేతలకు బహుమతుల ప్రదానం

బొడ్రాయిబజార్, జనవరి 6 : సంక్రాంతి పండుగను పురస్కరించుకుని బ్యూటీ పార్లర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం స్థానిక ట్యాంక్‌బండ్‌పై నిర్వహించిన ముగ్గుల పోటీల విజేతలకు సూర్యాపేట మున్సిపల్ చైర్మన్ పెరుమాళ్ల అన్నపూర్ణ బహుమతులు ప్రదానం చేశారు. మొదటి బహుమతి విజయలక్ష్మి, చైతన్య, రెండో బహుమతి కళ్యాణి, మూడో బహుమతి మౌనిక, నాలుగో బహుమతి ఉమ గెలుచుకున్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ షఫీఉల్లా, స్ఫూర్తి క్లబ్ అధ్యక్షురాలు హైమావతి, లయన్స్ క్లబ్ అధ్యక్షురాలు కవిత, బ్యూటీ పార్లర్ అసోసియేషన్ అధ్యక్షురాలు మన్నెం హైమావతి, ఉపాధ్యక్షురాలు వాసా ఉమ, గూడూరి రోజా, విజయలక్ష్మి, సాధిక, నాగవేణి, మసుమ పాల్గొన్నారు.

గరిడేపల్లి : గడ్డిపల్లి కేవీకేలో మాట్లాడుతున్న ఎస్‌బీఐ సూర్యాపేట రీజినల్ మేనేజర్ జ్యోతి

బ్యాంకు రుణాలను సద్వినియోగం చేసుకోవాలి

- ఎస్‌బీఐ సూర్యాపేట రీజినల్ మేనేజర్ జ్యోతి

గరిడేపల్లి, జనవరి 6 : రైతులు బ్యాంకు రుణాలను సద్వినియోగం చేసుకోవాలని సూర్యాపేట ఎస్‌బీఐ ఆర్ఎం కె.జ్యోతి కోరారు. నాబార్డు సహకారంతో కేంద్రం ప్రభుత్వం వ్యవసాయ రంగంలో అందిస్తున్న రుణాలపై మండలంలోని గడ్డిపల్లి కేవీకేలో రైతులు, వ్యవసాయ విద్యార్థులకు శనివారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. బ్యాంకుల ద్వారా రైతులు, వ్యవసాయ రంగానికి అందిస్తున్న రుణాల గురించి వివరించారు. అనంతరం నల్లగొండ, సూర్యాపేట నాబార్డు డీడీఎంలు వినయ్‌కుమార్, సత్యనారాయణ మాట్లాడుతూ ప్రస్తుతం నేషనల్ బ్యాంక్ ఫర్ అగ్రికల్చర్ రూరల్ డెవలప్‌మెంట్ ద్వారా వ్యవసాయోత్పత్తి, కిసాన్ క్రెడిట్ కార్డు, పాడి పరిశ్రమపై మైక్రో ఎంటర్‌ప్రైజెస్ కుటీర, గ్రామీణ పరిశ్రమలు, కళలు, చేతి పనులు, అభివృద్ధి, సాధికారతకు క్రెడిట్ లోన్లు అందిస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా గ్రామీణ ప్రాంతాల్లో చేతి పనులు, ఇతర అనుబంధ వాణిజ్య రంగాల ద్వారా రైతులకు ఇస్తున్న సబ్సిడీల గురించి వివరించారు. కార్యక్రమంలో కేవీకే ఇన్‌చార్జి పీసీ దొంగరి నరేశ్, శాస్త్రవేత్తలు సీహెచ్. నరేశ్, డి.ఆదర్శ్, టి.మాధురి, మల్లారెడ్డి వ్యవసాయ యూనివర్సిటీ విద్యార్థులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా నా క్లయింట్ అయిన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, జి.పి.కాంప్లెక్స్ శాఖ, కోదాడ చీఫ్ మేనేజర్ గారి నుండి సూచనలు పొంది సమస్త ప్రజలకు తెలియజేయునది ఏమనగా!

సూర్యాపేట జిల్లా, కోదాడ పట్టణ నివాసులైన శ్రీ వల్లూరి చంద్రశేఖర్, తండ్రి: నాంచారయ్య అనువారు స్థిరాస్తి అనగా కోదాడ రెవెన్యూ మరియు మునిసిపాలిటీ పరిధిలోని సర్వే నెంబరు 751/ఇ మింజుమల్లి బ్లాక్ నెంబరు 4లో ప్లాట్ నెంబరు 28, 29 దాఖాల 189.6 చదరపు గజములు నివేశన స్థలమును శ్రీ మామిడి వెంకటనారాయణ, తండ్రి: వెంకయ్య గారి నుంచి కొనుగోలు చేసి ది.06-01-2024న విక్రయ అగ్రిమెంట్ పొందియున్నారనియు, సదరు మామిడి వెంకటనారాయణ ఇట్టి ఆస్తిని శ్రీమతి కూచిపూడి రోశయ్య, భర్త: అంజిరెడ్డి గారి నుండి రిజిస్టరు దస్తావేజు నెం.4454/2021, తేది:16.04.2021 ద్వారా కొనుగోలు చేసియున్నారనియు, ఇట్టి ఆస్తికి సంబంధించిన ఒరిజినల్ రిజిస్టరు లింక్ దస్తావేజు నెం.1679/2008, తేది:20.02.2008 (సూరబోయిన రాములు గారి నుండి కూచిపూడి రోశమ్మ గారి పేరున సబ్ రిజిస్ట్రార్ కోదాడ వారి కార్యాలయములో రిజిస్టరు చేయబడినది)ను మామిడి వెంకటనారాయణ గారు దురదృష్టవశాత్తు పోగొట్టుకొనియున్నారని తె